Neti Velugu
నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com

‘నగీనా’గా మారిన జాన్వీ.. తల్లి శ్రీదేవికి ఏకానిక్ నివాళి!
4



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 198 | పేజీలు : 8 | నవంబర్ 2 సోమవారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 198 | PAGES:8 | MONDAY NOVEMBER 2 2026 | Rs. 4:00

అమిత్ షా పాదయాత్రకు బీజేపీ సర్వం సిద్ధం

- బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ వరకు యాత్ర
- ఏర్పాట్లను పరిశీలించిన కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు
- రాహుల్ గాంధీకి నాయకత్వ లక్షణాలు లేవు: ఈటల రాజేందర్

హైదరాబాద్/జీడిమెట్ల, నవంబరు 1: కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాపాదయాత్రకు (మిగతా 2వ పేజీలో..)



మోదీని గద్దె దించేదాకా పోరాటం ఆపం: రేవంత్

- మోదీ రావణుడైతే.. కాంగ్రెస్ కార్యకర్తలు వానరసైన్యం
- 13.5 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ
- మరో 7 కోట్ల ఓట్లు తొలగించేందుకు కుట్ర: సీఎం విమర్శ



న్యూఢిల్లీ, నవంబరు 1: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని రావణుడితో పోలుస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మోదీని గద్దె దించి గుజరాత్‌కు పంపించే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. ఆయనను ఓడించేందుకు తెలంగాణ నుంచి కాంగ్రెస్ కార్యకర్తల రూపంలో వానరసైన్యం ఢిల్లీకి తరలివచ్చిందని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలోని ఇండీ కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు ముందు తెలంగాణ భవన్‌లో పార్టీ శ్రేణులను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

ఓట్ల తొలగింపుతో అధికారంలోకి రావాలని కుట్ర

మోదీ తిరిగి అధికారంలోకి రావడానికి పేద ప్రజలను లక్ష్యంగా చేసుకొని వారి ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 13.5 కోట్ల ఓట్లు తొలగించారని, రానున్న రోజుల్లో మరో ఏడు కోట్ల ఓట్లను తొలగించి దొడ్డిదారిన అధికారంలోకి రావాలని బీజేపీ కుట్ర పన్నుతోందని విమర్శించారు. ఈ ప్రక్రియలో పేదల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

మహారాష్ట్ర, బిహార్, బెంగాల్‌లో లబ్ధి పొందారు

ఓట్ల చోరీ ద్వారా ఇప్పటికే మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ లబ్ధి పొందిందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వాన్ని ఓడించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

భూగర్భంలో దాక్కున్నా బయటకు లాగుతాం.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు ఖర్గే హెచ్చరిక

- జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ఖర్గే డిమాండ్
- ఢిల్లీలో ఇండియా కూటమి ‘ఢిల్లీ చలో’ ర్యాలీ
- మోదీ, అమిత్ షాపై ఖర్గే ఆరోపణలు
- ఓట్ల చోరీతో ప్రభుత్వాలు ఏర్పడ్డాయని విమర్శ
- ఈడీ, సీబీఐలకు భయపడబోమని స్పష్టీకరణ

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన భూగర్భంలో దాక్కున్నా బయటకు తీసుకొస్తామని



(మిగతా 2వ పేజీలో..)



3 రోజుల పాటు భారీ వర్షాలు

- రాష్ట్రంపై మురసు తుఫాను ప్రభావం: వాతావరణ శాఖ

హైదరాబాద్, నవంబరు 1: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుఫాను ‘మురసు’ ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమ, మంగళ, బుధవారాల్లో (మిగతా 2వ పేజీలో..)

ఈసారి మాపై దాడి చేస్తే, ప్రపంచంలో ఎక్కడైనా ప్రతిదాడి చేస్తాం: మొజ్తబా ఖమేనీ తీవ్ర హెచ్చరిక

- అమెరికా, ఇజ్రాయెల్ దాడులపై ఇరాన్ స్పందన
- భౌగోళిక పరిమితులు లేకుండా బదులిస్తామన్న సుప్రీం లీడర్ ఖొమైనీ
- సర్వసన్నద్ధంగా ఉండాలని సైనిక దళాలకు ఆదేశాలు
- ఒకవైపు దౌత్య చర్చలు, మరోవైపు యుద్ధ హెచ్చరికలతో ఉద్రిక్తత
- ఇరాన్ అణు కేంద్రాలపై దాడి చేయగలమన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్



అంతర్జాతీయ ఉద్రిక్తతల నడుమ ఇరాన్ సంచలన హెచ్చరికలు జారీ చేసింది. తమ దేశంపై అమెరికా లేదా ఇజ్రాయెల్ మళ్లీ దాడికి పాల్పడితే, ఎలాంటి భౌగోళిక పరిమితులు లేకుండా తక్షణమే, శక్తిమంతంగా బదులిస్తామని స్పష్టం చేసింది. ప్రపంచంలో ఎక్కడైనా దాడి చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు సర్వసన్నద్ధంగా ఉండాలని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ దేశ సాయుధ దళాలను ఆదేశించారు.ప్రస్తుత వివాదం మొదలైన తర్వాత తొలిసారిగా దేశంలోని ముగ్గురు ఉన్నత సైనిక కమాండర్లతో మొజ్తబా ఖమేనీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. “శత్రువులు మళ్లీ సైనిక లేదా ఉగ్రవాద దాడులకు దిగితే, ఆ ఘర్షణలు ఎప్పుడు, ఎలాంటి పరిస్థితుల్లో ముగుస్తాయో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ సైన్యం, ఇరాన్ ప్రజలే నిర్ణయిస్తారు” అని మొజ్తబా స్పష్టం చేసినట్లు ఆయన కార్యాలయం వెల్లడించింది. “శత్రు దేశాల భౌతిక, అభౌతిక ఆస్తులన్నింటినీ లక్ష్యం చేసుకునేలా టార్గెట్ డేటాబేస్‌ను నవీకరించాలని సూచించారు. ఈ సమావేశంలో సైనిక కమాండర్లు కూడా తమ సంసిద్ధతను ఖమేనీకి వివరించారు. పర్షియన్ గల్ఫ్ తీరం, హర్మూజ్ జలసంధి, ఒమన్ గల్ఫ్ సహా దేశ సరిహద్దుల వద్ద గరిష్ఠ స్థాయిలో అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. ఆయుధాలు, నిఘా పరికరాలు, మందుగుండు సామగ్రి ఉత్పత్తిని గణనీయంగా పెంచినట్లు నివేదించారు. సైనిక నిఘాను బలోపేతం చేయడం, స్వదేశీ రక్షణ సామర్థ్యాలను విస్తరించడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.మరోవైపు, ఇరాన్ ఉన్నత భద్రతా అధికారి మొహసెన్ రెజాయ్ మాట్లాడుతూ.. (మిగతా 2వ పేజీలో..)



ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావుపై మరో ఎఫ్ఐఆర్

- హైకోర్టు ఆదేశాలతో సిద్దిపేటలో కేసు నమోదు
- ఏ1గా హరీశ్‌రావు.. ఏ2గా రాధాకిషన్‌రావు
- ఫిర్యాదుదారు చక్రధర్‌గౌడ్ ఆరోపణల ఆధారంగా చర్యలు

హైదరాబాద్, నవంబరు 1: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతోపాటు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావుపై సిద్దిపేట పోలీసులు మరో కేసు నమోదు చేశారు. గతంలో హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సిద్దిపేటకు చెందిన వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హరీశ్‌రావును ఏ1గా, రాధాకిషన్‌రావును ఏ2గా పేర్కొన్నారు.

2024లో పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు

తన ఫోన్లను ట్యాప్ (మిగతా 2వ పేజీలో..)



‘ఓట్ చోరీ’పై నిరసన.. రాహుల్, రేవంత్‌పై కేటీఆర్ ఘాటు సెటైర్లు

- ఢిల్లీలో ‘ఓట్ చోరీ’ నిరసనపై కాంగ్రెస్‌ను విమర్శించిన కేటీఆర్
- ‘ఓట్ ఫర్ నోట్ చోర్’తో రాహుల్ గాంధీ ధర్నా చేస్తున్నారంటూ సెటైర్
- 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశాన్ని ప్రస్తావన
- ఎన్నికల కమిషనర్ రాజీనామా కోరుతూ విపక్షాల ‘చలో ఢిల్లీ’

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు (మిగతా 2వ పేజీలో..)

దూసుకొస్తున్న ‘మురసు’ తుపాను.. ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశం!

- బంగాళాఖాతంలో బలపడిన ‘మురసు’ తుపాను
- తీవ్ర తుపానుగా మారి ఏపీ తీరం వైపు వేగంగా పయనం
- నవంబర్ 2న అర్ధరాత్రి నెల్లూరు-నర్సాపురం మధ్య తీరం దాటే అవకాశం
- కోస్తాంధ్ర, తెలంగాణ, రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్ష సూచన



‘జ్ఞానేశ్ కుమార్ తర్వాత మీ వంతే మోదీజీ’.. ఢిల్లీ సభలో రాహుల్ గాంధీ హెచ్చరిక!



- జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి జైలుకు పంపిస్తామన్న రాహుల్
- ‘ఆయన తర్వాత మీ వంతే’ అంటూ ప్రధానికి హెచ్చరిక
- 15 శాతం ఓటర్ల పేర్లు తొలగించారని వ్యాఖ్య
- దేశ సంపద కొంత మంది చేతుల్లోనే ఉందని విమర్శ

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయనను పదవి నుంచి తొలగించి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఆ తర్వాత తమ పోరాటం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై ఉంటుందని పేర్కొన్నారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించిన భారీ ర్యాలీలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. “జ్ఞానేశ్ కుమార్ తర్వాత మీ వంతే మోదీజీ” అంటూ ప్రధానిని ఉద్దేశించి హెచ్చరించారు. జ్ఞానేశ్ కుమార్ లేకపోతే మోదీ ప్రధాని, అమిత్ షా హోంమంత్రి అయ్యేవారు కాదని వ్యాఖ్యానించారు. దేశంలో ఎన్నికల (మిగతా 2వ పేజీలో..)

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావుపై మరో ఎఫ్ఐఆర్

(మొదటి పేజీ తరువాయి)

చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ చక్రధర్‌గౌడ్ 2024డిసెంబరు 1న పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. హరీశ్‌రావు తదితరులపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసును సవాల్ చేస్తూ హరీశ్‌రావు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ వ్యవహారం హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు వెళ్లింది.

బెదిరింపులు, తప్పుడు కేసులు పెట్టించారని ఆరోపణ

మరణించిన రైతుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తూ ఆదుకుంటున్న నేపథ్యంలో ప్రజల్లో తనకు మద్దతు పెరుగుతోందని, దీంతో హరీశ్‌రావు తదితరులు తనను బెదిరింపులకు గురిచేశారని చక్రధర్‌గౌడ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావును ఉపయోగించుకుని తనను భయభ్రాంతులకు గురిచేశారని, తప్పుడు కేసులు పెట్టించారని ఆరోపించారు. ఆ కేసుల్లో బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత తన ఫిర్యాదుపై కేసు నమోదు చేయాలని పలుమార్లు పోలీసులను కోరినా స్పందించలేదని తెలిపారు.

భార్యాభర్తల ఫోన్లు ట్యాప్ చేశారని ఫిర్యాదు

హరీశ్‌రావు తదితరుల ఆదేశాల మేరకు తనతోపాటు తన భార్య ఫోన్లను కూడా ట్యాప్ చేశారని చక్రధర్‌గౌడ్ ఆరోపించారు. ఈ విషయమై యాపిల్ సంస్థ నుంచి తమకు హెచ్చరిక సందేశాలు వచ్చాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించగా, కేసును పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ నుంచి సిద్దిపేటకు బదిలీ చేసి కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది.

పలు ఐపీసీ సెక్షన్ల కింద కేసు

హైకోర్టు ఆదేశాల మేరకు కేసును సిద్దిపేటకు బదిలీ చేసిన పోలీసులు హరీశ్‌రావు తదితరులపై ఐపీసీ సెక్షన్లు 120బీ, 386, 409, 506, 419, 420, 467, 406 రెడ్‌విత్ 34తోపాటు ఐటీ చట్టం-2000లోని సెక్షన్ 66డీ కింద కేసు నమోదు చేశారు. పంజాగుట్టలో గతంలో నమోదైన కేసులో ఉన్న సెక్షన్లకు అదనంగా మరికొన్ని సెక్షన్లను చేర్చారు. ఫిర్యాదుదారు చేసిన ఆరోపణలపై దర్యాప్తు తదుపరి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

అమిత్ షా పాదయాత్రకు బీజేపీ సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ రాష్ట్ర నాయకత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. అరాచకాన్ని అరికట్టండి' అనే నినాదంతో ఈ పాదయాత్ర చేపట్టనున్నారు. బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ వరకు యాత్ర కొనసాగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగియనుంది.

పార్టీ ముఖ్య నేతల భాగస్వామ్యం

అమిత్ షాతోపాటు కేంద్ర మంత్రులు జీ. కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాదయాత్రలో పాల్గొననున్నారు. ఈ విషయాన్ని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్ వెల్లడించారు. పాదయాత్ర నిర్వహించే మార్గాన్ని, అక్కడ చేపట్టిన ఏర్పాట్లను రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం రాత్రి పరిశీలించారు.

రాహుల్‌కు నాయకత్వ లక్షణాలు లేవు: ఈటల

మరోవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీకి నాయకత్వ లక్షణాలు లేవని, నాయకత్వం వహించే సామర్థ్యం కూడా లేదని వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని కాపాడాలంటూ కాంగ్రెస్ విచిత్రమైన నాటకానికి తెరతీసిందని విమర్శించారు. భారతజాతి ఆత్మగౌరవాన్ని, కీర్తిని విదేశాల్లో పలుచన చేసేందుకు ప్రయత్నిస్తోందని, ప్రజాస్వామ్య వ్యవస్థలపై కాంగ్రెస్ దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు.

13 సార్లు ఎస్ఐఆర్ ప్రక్రియ

ఆదివారం జీడిమెట్లలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియను బీజేపీ ప్రారంభించలేదని, ఇప్పటివరకు దేశంలో 13 సార్లు ఈ ప్రక్రియ జరిగిందని పేర్కొన్నారు. విదేశీ నిధులతో మీడియా, సామాజిక మాధ్యమాలను ప్రభావితం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని రాహుల్ గాంధీపై ఆరోపణలు చేశారు.

3 రోజుల పాటు భారీ వర్షాలు

పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో సోమవారం ఆరెంజ్, మంగళవారం రెడ్, బుధవారం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సోమవారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు పడతాయని పేర్కొంది. మంగళవారం ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రెడ్ అలర్ట్ ప్రకటించింది. భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

భూగర్భంలో దాక్కున్నా బయటకు లాగుతాం.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు ఖర్గే హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయంటూ సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించిన 'ఢిల్లీ చలో' ర్యాలీలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సభ చరిత్రాత్మకమని అభివర్ణించిన ఖర్గే.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై ఆరోపణలు గుప్పించారు. యువత, మహిళలు, మైనారిటీల ఓటు హక్కులను హరించేందుకు వారు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు ప్రధాని, హోంమంత్రి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసులకు తాము భయపడబోమని చెప్పారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను అణచివేయలేరని అన్నారు.మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఓట్ల చోరీతోనే అధికారంలోకి వచ్చాయని ఖర్గే ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే మోదీని అధికారంలో నుంచి తొలగించాలని పిలుపునిచ్చారు. 'మోదీని తొలగించండి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని నినదించారు.మరోవైపు కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కూడా ఈ ర్యాలీపై స్పందించారు. ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించిన ఆందోళన కాదని, ప్రజల రాజ్యాంగ హక్కులను కాపాడేందుకేనని చెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించడం ఆమోదయోగ్యం కాదని ఆయన విమర్శించారు. ఎన్నికల జాబితా పూర్తిగా పారదర్శకంగా ఉండాలని డిమాండ్ చేశారు.

'ఓట్ చోరీ'పై నిరసన.. రాహుల్, రేవంత్‌పై కేటీఆర్ ఘాటు సెటైర్లు

(మొదటి పేజీ తరువాయి)

(కేటీఆర్) ధ్వజమెత్తారు. 'ఓట్ల చోరీ' ఆరోపణలపై నవంబర్ 1న ఢిల్లీలో 'ఇండియా' కూటమి తలపెట్టిన నిరసనను ఉద్దేశించి ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా ఎద్దేవా చేశారు.ఈ మేరకు కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ""ఓటుకు నోటు దొంగ'తో కలిసి 'ఎమ్మెల్యేల దొంగ' ఢిల్లీలో 'ఓట్ల చోరీ'కి వ్యతిరేకంగా నిరసన చేయడం కాంగ్రెస్‌కే చెల్లింది" అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణలో పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రోత్సహించిన రాహుల్ గాంధీ, ఇప్పుడు 'ఓటుకు నోటు' కేసులో నిందితుడైన రేవంత్ రెడ్డితో కలిసి దేశంలో ఓట్ల దొంగతనం గురించి ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. "భారత ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి" అంటూ తన పోస్ట్‌ను ముగించారు. ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఢిల్లీలో నిరసన చేపట్టనున్నాయి. కన్నాట్ ప్లేస్ నుంచి రాంలీలా మైదానం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు రాహుల్ గాంధీ ప్రకటించారు. అయితే, ఈ ర్యాలీకి ఎలాంటి అనుమతి తీసుకోలేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. ఈ నిరసనపై కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ స్పందిస్తూ.. గందరగోళం సృష్టించే బదులు గాంధేయ మార్గంలో శాంతియుతంగా నిరసన తెలపాలని సూచించారు.



ఈసారి మాపై దాడి చేస్తే, ప్రపంచంలో ఎక్కడైనా ప్రతిదాడి చేస్తాం: మొజ్తబా ఖమేనీ తీవ్ర హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

తమపై దాడి జరిగితే విధ్వంసకరంగా దెబ్బతీస్తామని, కొత్త ఆయుధాలను ఉపయోగిస్తామని హెచ్చరించారు. అయితే, అమెరికా తమ ఏడు షరతులకు అంగీకరిస్తే దౌత్యానికి ఇంకా అవకాశం ఉందని తెలిపారు. అంక్షల ఎత్తివేత, అమెరికా సైనిక ఉనికిని తగ్గించడం, స్తంభింపజేసిన ఆస్తుల విడుదల, చమురు మినహాయింపుల పునరుద్ధరణ వంటివి ఈ షరతులలో ఉన్నాయి.ఈ హెచ్చరికల నేపథ్యంలోనే తెరవెనుక దౌత్యపరమైన చర్చలు కూడా కొనసాగుతున్నాయి. అయితే చర్చలు బాగానే సాగుతున్నప్పటికీ, ఇరాన్ "అంత నమ్మదగినది కాదు" అని, అవసరమైతే వారి అణు కేంద్రాలపై దాడి చేసే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించడం ఉద్రిక్తతలను మరింత పెంచుతోంది.

'జ్ఞానేశ్ కుమార్ తర్వాత మీ వంతే మోదీజీ'.. ఢిల్లీ సభలో రాహుల్ గాంధీ హెచ్చరిక!

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియను ప్రభావితం చేసేందుకు ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు, చేర్పులు చేస్తున్నారని ఆరోపించారు. ఈవీఎంల ద్వారా కూడా ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని విమర్శించారు. మధ్యప్రదేశ్, హర్యానా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు.2024 ఎన్నికల తర్వాత దేశంలోని 15 శాతం మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారని రాహుల్ పేర్కొన్నారు. ఆ ఎన్నికలు చట్టవిరుద్ధంగా జరిగాయని, ప్రజల తీర్పును దొంగిలించారని ఆరోపించారు. ఓటర్ల పేర్ల తొలగింపు దేశద్రోహంతో సమానమని, ఇది అత్యంత తీవ్రమైన కేసుల్లో ఒకటని అభివర్ణించారు. ఈ ఆరోపణలకు ఎన్నికల సంఘం వెల్లడించిన గణాంకాలే ఆధారమని చెప్పారు.దేశ సంపద కొంత మంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని రాహుల్ విమర్శించారు. రైతులు కష్టపడి పండించిన పంటకు తగిన ప్రతిఫలం దక్కాలని, చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు రావాలని అన్నారు. యువత, మహిళలు, కార్మికులు, రైతులకు హక్కులు దక్కడం లేదని ఆరోపించారు. దేశం ఇద్దరు ముగ్గురు సంపన్నుల సొత్తు కాదని, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు ఉండాలని స్పష్టం చేశారు.అందరూ స్వేచ్ఛగా జీవిస్తూ, తమ కష్టానికి తగిన ఫలితం పొందే భారతదేశం కావాలని ఆకాంక్షించారు. తనకు మతం కంటే ప్రతి భారతీయుడి గొంతుకే ముఖ్యమని చెప్పారు. మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌లపై తనకు వ్యక్తిగత ద్వేషం లేదని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై దాడులు చేయబోమని అన్నారు. ప్రేమ, అహింస మార్గంలోనే పోరాడతామని, అయితే రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి మాత్రం అనుమతించబోమని హెచ్చరించారు. ఈ ఆందోళన ఏ ఒక్క పార్టీ కోసం కాదని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసమని ఇండియా కూటమి నేతలు చెబుతున్నారు. మరోవైపు, ఎన్నికల సంఘం మాత్రం ఓటర్ల జాబితా సవరణలో అనర్హులు, మరణించినవారు, వేరే ప్రాంతాలకు వెళ్లిపోయినవారు, నకిలీ పేర్లను గుర్తించి తొలగిస్తున్నామని వివరిస్తోంది. సవరణలో గుర్తించిన 13.39 కోట్ల పేర్లన్నీ అర్హులైన ఓటర్ల తొలగింపుగా భావించరాదని స్పష్టం చేసింది. పేర్లు తొలగించిన, అర్హులైన ఓటర్లు నిబంధనల ప్రకారం మళ్లీ నమోదు చేసుకోవచ్చని తెలిపింది.

దూసుకొస్తున్న 'మురసు' తుపాను.. ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశం!

(మొదటి పేజీ తరువాయి)

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మురసు' తుపాను వేగంగా బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ప్రస్తుతం నైరుతి, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ తుపాను, రానున్న 24 గంటల్లో తీవ్ర తుపానుగా మారనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. నవంబర్ 2వ తేదీ రాత్రి సమయంలో దక్షిణ కోస్తాంధ్రలోని నెల్లూరు, నర్సాపురం మధ్య, ఒంగోలుకు సమీపంలో ఇది తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేసింది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, కొన్ని సందర్భాల్లో గాలి వేగం గంటకు 120 కిలోమీటర్లకు చేరుకోవచ్చని తెలిపింది.భారత వాతావరణ శాఖ ఆదివారం సాయంత్రం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, 'మురసు' తుపాను గత ఆరు గంటల్లో గంటకు 25 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా పయనించింది. ప్రస్తుతం ఇది చెన్నైకి ఆగ్నేయంగా 420 కిలోమీటర్లు, నెల్లూరుకు ఆగ్నేయంగా 490 కిలోమీటర్లు, మచిలీపట్నానికి ఆగ్నేయంగా 500 కిలోమీటర్లు, కావలికి తూర్పు ఆగ్నేయంగా 510 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఆదివారం రాత్రి నాటికి ఇది మరింత బలపడి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఆ తర్వాత వాయవ్య దిశగా కదులుతూ నవంబర్ 2న సాయంత్రం లేదా రాత్రి వేళకు ఆంధ్రప్రదేశ్ తీరాన్ని సమీపిస్తుంది.

తీర ప్రాంత జిల్లాలపై తీవ్ర ప్రభావం

తుఫాను తీరం దాటే సమయంలో దాని ప్రభావం దక్షిణ కోస్తాంధ్ర జిల్లాలపై తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా బాపట్ల, గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సముద్రపు అలలు సాధారణం కంటే 1 నుంచి 1.5 మీటర్ల ఎత్తు వరకు ఎగసిపడే అవకాశం (స్టార్మ్ సర్జ్) ఉందని, దీనివల్ల తీర ప్రాంతాలు జలమయం కావచ్చని అప్రమత్తం చేసింది. ఈ నాలుగు జిల్లాల్లో సముద్రపు పోటు ప్రభావం గరిష్ఠంగా ఉంటుందని ప్రత్యేకంగా పేర్కొంది. తుపాను ప్రభావంతో కోస్తాంధ్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు, మత్స్యకారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

తుపాను గమనం, బలహీనత

నవంబర్ 2న రాత్రి తీరం దాటిన తర్వాత 'మురసు' తుపాను క్రమంగా బలహీనపడుతుంది. భూభాగంపైకి ప్రవేశించాక, నవంబర్ 3వ తేదీ ఉదయానికి తీవ్ర తుపాను నుంచి సాధారణ తుపానుగా మారుతుంది. ఆ తర్వాత మరింత బలహీనపడి వాయుగుండంగా, ఆపై అల్పపీడనంగా మారుతుందని ఐఎండీ అంచనా వేసింది. ఇన్ శాట్ 3డీఎస్ ఉపగ్రహ చిత్రాల ప్రకారం, తుపాను కేంద్రం వద్ద దట్టమైన మేఘాలు కేంద్రీకృతమై ఉన్నాయని, ఇది దాని తీవ్రతకు నిదర్శనమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. తీర ప్రాంత జిల్లాల అధికారులను సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రజలు అనవసర ప్రయాణాలు మానుకోవాలని, అధికారిక ప్రకటనలను అనుసరించాలని సూచించింది.

మురసు' తుపాను ప్రభావంతో ఏపీతో పాటు పలు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు

కోస్తాంధ్ర: నవంబర్ 1న అక్కడక్కడా భారీ వర్షాలు, నవంబర్ 2, 3 తేదీల్లో చాలా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్నిచోట్ల కుండపోత (అత్యంత భారీ) వర్షాలు పడతాయి. నవంబర్ 4న కూడా అక్కడక్కడా భారీ వర్షాలు కొనసాగుతాయి.

రాయలసీమ: నవంబర్ 2, 3 తేదీల్లో చాలా చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

తెలంగాణ: నవంబర్ 2 నుంచి 4 వరకు చాలా ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, నవంబర్ 3న కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

తమిళనాడు, దక్షిణ ఒడిశా, ఛత్తీస్‌గఢ్: ఈ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో కూడా నవంబర్ 2 నుంచి 4 మధ్య భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే సూచనలు ఉన్నాయి.

గాలులు, సముద్రపు అలల ఉద్ధృతి

తుపాను తీరానికి సమీపిస్తున్న కొద్దీ గాలుల తీవ్రత, సముద్రపు అలల ఉద్ధృతి గణనీయంగా పెరుగుతుంది. కోస్తాంధ్ర తీరం వెంబడి నవంబర్ 1 సాయంత్రం నుంచి గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు ప్రారంభమై, నవంబర్ 2 అర్ధరాత్రి నాటికి గంటకు 100-120 కిలోమీటర్ల స్థాయికి చేరుకుంటాయి. సముద్రం అత్యంత కల్లోలంగా, అలలు 9 నుంచి 14 మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడే ప్రమాదం ఉంది. తుపాను తీరం దాటే సమయంలో సముద్రపు అలల ఉప్పెన (స్టార్మ్ సర్జ్) కారణంగా తీరప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలు సుమారు 1 మీటరు మేర ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా బాపట్ల, కృష్ణా, ప్రకాశం జిల్లాలపై ఈ ప్రభావం అధికంగా ఉంటుందని హెచ్చరించారు.

అధికారుల హెచ్చరికలు, సూచనలు

తుపాను కారణంగా భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. పూరిళ్లు, కచ్చా ఇళ్లకు తీవ్ర నష్టం, విద్యుత్, కమ్యూనికేషన్ స్తంభాలు దెబ్బతినడం, చెట్లు కూలిపోవడం, రహదారులు, రైల్వే ట్రాక్‌లు దెబ్బతినడం వంటివి జరగవచ్చని అంచనా వేసింది. అరటి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకు, వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

ఈ నేపథ్యంలో అధికారులు పలు సూచనలు జారీ చేశారు:

మత్స్యకారులు నవంబర్ 4 వరకు బంగాళాఖాతంలో వేటకు వెళ్లడం పూర్తిగా నిలిపివేయాలి.

తీరప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు, గుడిసెవాసులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి.

తుపాను సమయంలో ప్రజలు ఇళ్లలోనే ఉండాలి. బలహీనమైన కట్టడాలలో ఆశ్రయం పొందవద్దు.

రైలు, రోడ్డు ప్రయాణాలను అవసరమైతే తప్ప వాయిదా వేసుకోవాలి.

అధికారులు జారీ చేసే ట్రాఫిక్ సూచనలను తప్పనిసరిగా పాటించాలి.

షిప్పింగ్, పోర్ట్ కార్యకలాపాలను నిలిపివేయాలని, ఆఫ్‌షోర్ ఆపరేషన్లను తాత్కాలికంగా ఆపాలని సూచించారు.

మొత్తం మీద, 'మురసు' తుపాను ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నందున, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండి, ప్రభుత్వ సూచనలను పాటిస్తూ, సురక్షితంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వండి

- **ఉద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి: దేవీప్రసాద్, కంచర్ల పిలుపు**
- **ఆకునూరి లక్ష్మయ్య పదవీ విరమణ సన్మాన సభలో రాజకీయ నేతల వ్యాఖ్యలు**

నల్లగొండ నవంబర్ 1 (నేటి వెలుగు) :

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగులు, పట్టభద్రులు బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలిచి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, టీఎన్జీవో మాజీ అధ్యక్షులు గుండవరపు దేవీప్రసాద్ రావు, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. భూగర్భ జలవనరుల శాఖలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఆకునూరి లక్ష్మయ్యకు నిర్వహించిన సన్మాన సభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా దేవీప్రసాద్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో టీఎన్జీవోలు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు 43 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడంతో పాటు ఉద్యోగులు ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, 180 మంది ఉద్యోగులను సస్పెండ్ చేయడం కక్ష సాధింపు చర్యలకు నిదర్శనమని విమర్శించారు. ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందడం లేదని ఆరోపించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శిస్తూ, రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో ఉద్యోగులు, పట్టభద్రులు తమ నిరసనను ఓటు ద్వారా తెలియజేయాలని కోరారు. అనంతరం కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆకునూరి లక్ష్మయ్య భూగర్భ జలవనరుల శాఖలో ఎన్నో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి విశేష సేవలందించారని కొనియాడారు. ఆయన పదవీ విరమణ అనంతరం కూడా ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. లక్ష్మయ్య



పదవీ విరమణ సభను టీఎన్జీవో హాల్‌లో నిర్వహించాల్సి ఉండగా, రాజకీయ కారణాలతో కొంతమంది టీఎన్జీవో నాయకులు అడ్డుకుని ఆయనను అవమానపరిచారని కంచర్ల ఆరోపించారు. ఇది బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. లక్ష్మయ్య భవిష్యత్తులో ప్రజలకు మరింత సేవ చేయాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని, పార్టీలో సముచిత స్థానం కల్పించి గౌరవిస్తామని తెలిపారు. పానగల్లుకు పూర్వవైభవం తీసుకురావడంలో ఆయన భాగస్వామి కావాలని కోరారు.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు జరిగిన మేలును గుర్తుచేసుకుని ప్రస్తుత ప్రభుత్వ విధానాలను బేరీజు వేసుకోవాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలని నేతలు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ నగర బీఆర్ఎస్ అధ్యక్షులు భువనగిరి దేవేందర్, కంచనపల్లి రవీందర్ రావు, కొండూరు సత్యనారాయణ, కార్పొరేటర్లు కొండూరు దీపిక, ప్రవీణ్ రెడ్డి, బాణావత్ దీప్లా, రావుల శ్రీనివాస్ రెడ్డి, జమాల్ ఖాద్రి, పెరిక కరణ్, జయరాజ్, యాట జయప్రద రెడ్డి, జిల్లా టీఎన్జీవో మాజీ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, పలువురు టీఎన్జీవో నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పూర్వ విద్యార్థులు..

- **మృతుడి కుటుంబానికి రూ.65,300 ఆర్థిక సాయం**

నల్లగొండ నవంబర్ 1(నేటి వెలుగు):



కట్టంగూర్ ఆదర్శ గురుకుల విద్యాలయంలో 2004-05 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి నల్లగొండ మండలం దండంపల్లి గ్రామానికి చెందిన మల్లెబోయిన వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆయన పూర్వ విద్యార్థి మిత్రులు, అప్పటి ప్రిన్సిపాల్ కొంక ప్రవీణ్, కరస్పాండెంట్ బుడిగే సైదులు స్పందించి మానవత్వాన్ని చాటుకున్నారు.2004-05 బ్యాచ్ పూర్వ విద్యార్థులతో పాటు ఇతర దాతల సహకారంతో మొత్తం రూ.65,300 (అరవై ఐదు వేల మూడు వందల రూపాయలు) సేకరించారు. ఈ మొత్తాన్ని ఆదివారం వెంకన్న కుటుంబ సభ్యులకు అందజేశారు.ఆపద సమయంలో తమతో కలిసి చదువుకున్న మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించడం పలువురి ప్రశంసలు అందుకుంది.ఈ కార్యక్రమంలో కొంక ప్రవీణ్, పోగుల శ్రీను, మల్లెబోయిన శ్రీను, వెంకన్న కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ పోలీసులకు దక్షతా పతకాలు.. బీసీ జేఏసీ అభినందనలు

- **24 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్**

హైద్రాబాద్ నవంబర్ 1 (నేటి వెలుగు)



తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన దక్షతా పతకాలను సాధించిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన 24 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి బీసీ జేఏసీ పక్షాన హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో అంకితభావంతో పనిచేస్తూ తమ ప్రతిభను చాటుకున్న పోలీసు సిబ్బందికి ఈ పతకాలు దక్కడం గర్వకారణమని పేర్కొన్నారు.విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావంతో పనిచేసే పోలీసు సిబ్బందిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ పురస్కారాలు పోలీసు శాఖలోని ఇతర అధికారులు, సిబ్బందికి కూడా స్ఫూర్తినిస్తూ మరింత బాధ్యతతో ప్రజాసేవలో ముందుకు సాగేందుకు ప్రేరణ కలిగిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దక్షతా పతకాలు అందుకున్న 24 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి మరోసారి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని జాజుల లింగం గౌడ్ ఆకాంక్షించారు.

మునుగోడులో ఉచిత కంటి వైద్య సేవలు భేష్!





- **18వ విడత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులు**
- **17 శిబిరాల్లో 13,430 మందికి కంటి పరీక్షలు.. 2,859 మందికి ఆపరేషన్లు.. 6,075 మందికి కళ్లద్దాల పంపిణీ**

మునుగోడు నవంబర్ 1 (నేటి వెలుగు)

చూపు ప్రతి ఒక్కరికీ ఎంతో ముఖ్యమని, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోమటిరెడ్డి లక్ష్మీ అన్నారు. తన నియోజకవర్గ ప్రజలు కంటి సమస్యలతో బాధపడకూడదనే లక్ష్యంతో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాలను నిరంతరంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో నిర్వహించిన 18వ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన సతీమణి, కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మీతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం తన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు కంటి పరీక్షలు చేయించుకుంటున్న వృద్ధులు, మహిళలను ఆత్మీయంగా పలకరించి వైద్య శిబిరం నిర్వహణను పరిశీలించారు. కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారికి ధైర్యం చెబుతూ, ఎలాంటి ఆందోళన చెందవద్దని, మీ వైద్య ఖర్చులు, బాధ్యత నాదేనని భరోసా ఇచ్చారు. ధైర్యంగా వెళ్లి కంటి పరీక్షలు, అవసరమైన ఆపరేషన్లు చేయించుకోవాలని సూచించారు.తన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ జ్ఞాపకార్థం ఆమె పేరుతో ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ద్వారా మునుగోడు నియోజకవర్గంలో ఇప్పటివరకు 17 విడతల ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరాల ద్వారా ఇప్పటివరకు 13,430 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా,



2,859 మందికి కంటి ఆపరేషన్లు పూర్తి చేశారు. మరో 6,075 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు.18వ విడత శిబిరంలో మొత్తం 623 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 228 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. వీరిలో 109 మందిని తక్షణమే హైదరాబాద్‌లోని శంకరా కంటి ఆసుపత్రికి తరలించారు.కంటి వైద్య శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ భోజన సదుపాయం కల్పించడంతో పాటు, వృద్ధులు, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఫీనిక్స్ ఫౌండేషన్, శంకరా కంటి ఆసుపత్రి సహకారంతో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. పేదలు, వృద్ధులకు నాణ్యమైన కంటి వైద్యం అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ సేవా కార్యక్రమాలకు నియోజకవర్గ ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

సువెన్ కెమికల్ ఫ్యాక్టరీలో వరుస ప్రమాదాలు.. కార్మికుల ప్రాణాలతో చెలగాటం!

- **అర్ధరాత్రి రియాక్టర్ పేలుడు.. చికిత్స పొందుతూ కార్మికుడు మృతి**
- **మూడు నెలల్లో వరుస ప్రమాదాలతో బిక్కుబిక్కుమంటున్న కార్మికులు.. భద్రతా చర్యలపై తీవ్ర ఆందోళన**

సూర్యాపేట జిల్లా నవంబర్ 1 (నేటి వెలుగు)



సూర్యాపేటలోని కోహాన్స్ (సువెన్) కెమికల్ పరిశ్రమలో వరుస ప్రమాదాలు కార్మికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా అర్ధరాత్రి పరిశ్రమలోని బ్లాక్-1లో రియాక్టర్ పేలడంతో తీవ్రంగా గాయపడిన కార్మికుడు హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందడం కలకలం రేపింది. మృతుడిని అర్వపల్లి మండలం పర్సాయిపల్లి గ్రామానికి చెందిన పుప్పాల వెంకన్న (38)గా గుర్తించారు. పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వెంకన్నను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఆయన మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మూడు నెలల్లో వరుస ప్రమాదాలు..

సువెన్ కెమికల్ పరిశ్రమలో గత మూడు నెలల వ్యవధిలో వరుసగా ప్రమాదాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా జరిగిన రియాక్టర్ పేలుడు ఘటనతో కార్మికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలు చేస్తున్నారా? రియాక్టర్ల నిర్వహణ, అత్యవసర రక్షణ వ్యవస్థలు ఎలా ఉన్నాయి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

వరుస ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై కార్మికులు, స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాల అమలు, రియాక్టర్ల స్థితిగతులు, కార్మికులకు రక్షణ పరికరాల సరఫరా, అత్యవసర స్పందన వ్యవస్థలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు. ఒక కార్మికుడి ప్రాణం పోయిన తర్వాత స్పందించడం కాకుండా, మరో ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సువెన్ పరిశ్రమలో వరుస ప్రమాదాలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు కార్మికుల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఓటు హక్కే ప్రజాస్వామ్యానికి పునాది!

- **ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగొద్దు**
- **'ఓట్ బచావో--దేశ్ బచావో' కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి**

వర్ధన్నపేట, నవంబర్ 01 (నేటి వెలుగు)

: అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఎవరికీ అన్యాయం జరగకుండా చూడాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు డిమాండ్ చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు న్యూఢిల్లీలో నిర్వహించిన 'ఓట్ బచావో--దేశ్ బచావో' కార్యక్రమంలో హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ,



ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటిస్తూ



ప్రతి పౌరుడి ఓటు హక్కుకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వర్ధన్నపేట పీఏసీఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తూళ్ల రవి, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాంపల్లి యాదగిరి, వర్ధన్నపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బొక్కల ప్రమోద్, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు బిర్రు రాజు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ కుల్ల యాకాంతం, దమ్మన్నపేట గ్రామ సర్పంచ్ దుబ్బ అంజయ్య, ల్యాబర్తి ఉపసర్పంచ్ సంకినేని గంగరాజుతో పాటు పలువురు కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వట్టికోట ఆళ్వార్ స్వామి జయంతి వేడుకలు

నల్లగొండ నవంబర్ 1 నేటి వెలుగు:



జిల్లా కేంద్ర గ్రంథాలయం, నల్లగొండలో తెలంగాణ వైతాళికుడు, ప్రజా రచయిత, గ్రంథాలయ ఉద్యమ స్ఫూర్తిప్రదాత వట్టికోట ఆళ్వార్ స్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి బి. బాలమ్మ ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ, వట్టికోట ఆళ్వార్ స్వామి తన రచనల ద్వారా సమాజంలోని అన్యాయాలు, అసమానతలను ప్రశ్నించారని పేర్కొన్నారు. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు సాహిత్యాన్ని ఆయుధంగా మలిచిన గొప్ప రచయిత అని కొనియాడారు.తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ప్రజల పక్షాన నిలిచి, పుస్తక పఠనం, గ్రంథాలయాల అభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడని గుర్తుచేశారు. ఆయన రచించిన ప్రజల మనిషి నవల తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిందని తెలిపారు.నేటి యువత వట్టికోట ఆళ్వార్ స్వామి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గాదె వినోద్ రెడ్డి,కవులు మేరెడ్డి యాదగిరి రెడ్డి,పున్న అంజయ్య,కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, సాహిత్యాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

నేటితో 53 ఏళ్లు.. ఐశ్వర్యారాయ్ డైట్ సీక్రెట్ ఇదే..!

ఐశ్వర్యారాయ్ ఆహారంలో ఇంటి భోజనానికే ప్రాధాన్యం
ఉదయం ఓట్స్, బ్రౌన్ బ్రెడ్ వంటి అల్పాహారం
మధ్యాహ్నం పప్పు, చపాతీ, కూరగాయలు
రాత్రి తేలికపాటి భోజనం తీసుకుంటారని కథనాలు
తాజా పండ్లు, నట్స్ స్నాక్స్‌గా తీసుకుంటారని సమాచారం



బాలీవుడ్ నటి ఐశ్వర్యారాయ్ అందం, ఫిట్‌నెస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న ఆమెకు నేటితో 53 ఏళ్లు. తన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆమె ఖరీదైన డైట్ ప్లాన్లు అనుసరిస్తారని చాలామంది అనుకుంటారు. కానీ ఆమె ఆహారపు అలవాట్లు మాత్రం చాలా సాదాసీదాగా ఉంటాయి. ఎన్డీటీవీ కథనం ప్రకారం, ఇంట్లో వండిన సాధారణ భోజనానికే ప్రాధాన్యం ఇస్తుంది. పప్పు, అన్నం, కూరగాయల వంటి సంప్రదాయ ఆహారమే తనకు ఇష్టమని గతంలో పలు ఇంటర్వ్యూల్లో వెల్లడించింది.

ఉదయం ఇలా మొదలు

ఐశ్వర్య ఉదయం నిద్రలేవగానే గోరువెచ్చని నీటిలో నిమ్మరసం, తేనె కలుపుకొని తాగుతుంది. అల్పాహారాన్ని మాత్రం స్కిప్ చేయదు. బ్రౌన్ బ్రెడ్ టోస్ట్, ఓట్స్ వంటి పీచు పదార్థాలు, ప్రొటీన్లు ఉండే ఆహారాన్ని తీసుకుంటుందట.

మధ్యాహ్నం ఇంటి భోజనమే

లంచ్‌లో పప్పు, చపాతీ, ఉడికించిన కూరగాయలకు ప్రాధాన్యం ఇస్తుంది. అన్నం, పప్పు, కూరలతో కూడిన సాధారణ భారతీయ భోజనం తనకు ఎంతో ఇష్టమని ఆమె గతంలో పేర్కొంది. ప్రత్యేకమైన ఆహార నియమాల కంటే సమతుల్యమైన ఇంటి భోజనానికే ప్రాధాన్యం ఇస్తుంది.

రాత్రి తేలికపాటి ఆహారం

రాత్రిపూట తక్కువ పరిమాణంలో ఆహారం తీసుకుంటుంది. బ్రౌన్ రైస్, గ్రిల్డ్ ఫిష్, ఉడికించిన కూరగాయలు వంటి పదార్థాలు ఆమె డిన్నర్‌లో ఉంటాయని సమాచారం. రోజంతా ఒకేసారి ఎక్కువగా తినకుండా చిన్న చిన్న పరిమాణాల్లో ఆహారం తీసుకోవడం కూడా ఆమెకు అలవాటు.

జంక్ ఫుడ్‌కు దూరం

నూనెలో వేయించిన పదార్థాలు, జంక్ ఫుడ్ కంటే తాజా పండ్లు, కూరగాయలు, నట్స్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. రోజంతా తగినంత నీరు తాగుతూ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకుంటుంది. యోగా, నడక వంటి శారీరక వ్యాయామాలకూ ప్రాధాన్యం ఇస్తుంది.

రాప్తాడు ఘటనతో 'సినిమా'పై చర్చ.. ఆర్జీవీ ఏమన్నాడంటే!

'యానిమల్'లో సినిమాలో స్కూల్‌లో హింస సన్నివేశంపై సోషల్ మీడియాలో విమర్శలు

సినిమాల్లో హింసాత్మక సన్నివేశాలు యువతపై ప్రభావం చూపుతున్నాయన్న చర్చపై దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ స్పందించాడు. సినిమాల్లో హింసను చూపించడం వల్ల సమాజంలో నేరాలు పెరుగుతున్నాయని విమర్శించడం సరికాదన్నాడు. సినిమాలపై వస్తున్న విమర్శలు సరైన దిశలో లేవని అభిప్రాయపడ్డాడు. ఈ మేరకు ఆదివారం తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశాడు. "కిడ్నాప్‌లు పెరుగుతున్నాయని రామాయణాన్ని నిందించడం ఎంత తప్పో.. హింస పెరుగుతోందని సినిమాలను నిందించడం కూడా అంతే తప్పు" అని వ్యాఖ్యానించాడు.అనంతపురం జిల్లా రాప్తాడులోని ఓ పాఠశాలలో నిన్న జరిగిన రంపం దాడి నేపథ్యంలో ఈ చర్చ మొదలైంది. 21 ఏళ్ల యువకుడు పదో తరగతి గదిలోకి వెళ్లి 15 ఏళ్ల బాలికపై ఎలక్ట్రిక్ రంపంతో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థినికి కూడా గాయాలయ్యాయి. ప్రాథమిక పోలీసు విచారణ ప్రకారం.. నిందితుడు బాధితురాలికి బంధువని, ఆమెను కొంతకాలంగా వేధిస్తున్నాడని తెలుస్తోంది. బాధితురాలు బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.ఈ ఘటన తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ నటించిన 'యానిమల్' సినిమాలోని ఓ సన్నివేశంపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. ఆ సన్నివేశంలో రణ్‌బీర్ ఏకే-47 తుపాకీతో పాఠశాల తరగతి గదిలోకి ప్రవేశిస్తాడు. సినిమాలు హింసను గొప్పగా చూపిస్తున్నాయని పలువురు విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. హింసను పురుషత్వానికి చిహ్నంగా చూపించడం యువతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని మరికొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సందీప్ రెడ్డి వంగాకు ఆర్జీవీ గతంలోనూ మద్దతుగా నిలిచాడు. ఆయన సినిమాల శైలిని పలుమార్లు ప్రశంసించాడు.



నెల రోజులైనా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాలేదు -- రైతులను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం!





- కాంటాలు వేయడం లేదు.. ధాన్యం తరలించడం లేదు.. అకాల వర్షాలతో అన్నదాతకు తీరని నష్టం!
- బీజేపీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి

నల్గొండ జిల్లా నవంబర్ 1 (నేటి వెలుగు)

నల్గొండ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తమ పంటను తీసుకొచ్చి దాదాపు నెల రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో కాంటాలు ప్రారంభం కాలేదు. కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని తరలించే ప్రక్రియ కూడా ముందుకు సాగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనమని బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేయకపోవడం వంటి కారణాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎన్నో కష్టాలు, నష్టాలు భరించి పండించిన కొద్దిపాటి పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే అక్కడ కూడా రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంట చేతికొచ్చిన ఆనందం రైతులకు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని ఆయన మండిపడ్డారు.ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే జిల్లాలో ఎంత విస్తీర్ణంలో వరి సాగవుతుంది? ఎంత ధాన్యం దిగుబడి వస్తుంది? ఎన్ని కొనుగోలు కేంద్రాలు అవసరం? ధాన్యం తరలింపునకు ఎలాంటి ఏర్పాట్లు చేయాలి? అనే అంశాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాల్సిన ప్రభుత్వం, అధికారులు ఆ విషయంలో పూర్తిగా విఫలమయ్యారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఎప్పుడు, ఎంత పరిమాణంలో ధాన్యం వస్తుందనే కనీస అంచనాలు కూడా అధికారులకు లేకపోవడం ప్రభుత్వ ముందుచూపు లేమికి నిదర్శనం. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే నేడు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.నల్గొండ జిల్లాకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శాపంగా మారారని డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి విమర్శించారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం మాత్రమే బాధ్యత కాదని, రైతులు తీసుకొచ్చిన ధాన్యానికి వెంటనే కాంటాలు వేసి, కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసి, ధాన్యాన్ని మిల్లులకు తరలించే బాధ్యతను కూడా ప్రభుత్వం తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, తరలింపు విషయంలో మంత్రి ప్రత్యేక చొరవ చూపకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఇప్పటికే నిన్న, నేడు కురుస్తున్న అకాల వర్షాలు, ముసురు కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం మళ్లీ తడిసిపోతోంది. రైతులు ఎంతో కష్టపడి పండించిన పంట వర్షానికి తడిసి నష్టపోతుంటే ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం బాధాకరం. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి రైతులు పడిగాపులు కాస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించడంలో కూడా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తడిసిన ధాన్యం వల్ల నాణ్యత తగ్గి రైతులకు మరింత నష్టం జరిగే పరిస్థితి నెలకొంది.కేంద్ర ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర (మీూా) అందిస్తూ, ధాన్యం సేకరణకు అవసరమైన సహకారం అందిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, కాంటాలు, ధాన్యం తరలింపు విషయంలో పూర్తిగా విఫలమవుతోంది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న మద్దతు రైతులకు పూర్తిస్థాయిలో అందేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. కేంద్రం రైతులకు అండగా నిలుస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ధాన్యం కొనుగోలు, తరలింపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి

1. కొనుగోలు కేంద్రాల్లో నెల రోజులుగా ఎదురుచూస్తున్న రైతుల ధాన్యానికి తక్షణమే కాంటాలు వేయాలి.
2. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే మిల్లులకు తరలించాలి.
3. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడేందుకు టార్పాలిన్లు, ఇతర రక్షణ ఏర్పాట్లు చేయాలి.
4. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ సంచులు, హమాలీలు, రవాణా వాహనాలను అందుబాటులో ఉంచాలి.
5. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు నష్టం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలి.
6. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అధికారుల పర్యవేక్షణ పెంచి, రైతులకు ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.

రైతులను ఆదుకోవాల్సిన సమయంలో రాజకీయాలు కాదు.. బాధ్యత ముఖ్యం!

నల్గొండ జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి విమర్శించారు. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతుల సమస్యలపై చూపాల్సిన శ్రద్ధను చూపడం లేదని, ప్రజా సమస్యల పరిష్కారం కంటే తమ రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో చూపాల్సిన శ్రద్ధను దోచుకోవడం, దాచుకోవడంపై చూపుతున్నారనే విమర్శలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు.రైతుల కష్టాన్ని రాజకీయ ప్రచారానికి పరిమితం చేయకుండా, వారి పంటను సకాలంలో కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు, కాంటాలు, తరలింపు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. రైతులను ఇలాగే నిర్లక్ష్యం చేస్తే భారతీయ జనతా పార్టీ రైతుల పక్షాన నిలబడి ప్రజా ఉద్యమాలకు సిద్ధమవుతుందని డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, బీజేపీ నాయకులు వంగూరి రాఖీ,పాలకూరి రవిగౌడ్, మంగలిపల్లి కిషన్ తదితరులు పాల్గొన్నారు

'నగీనా'గా మారిన జాన్వీ.. తల్లి శ్రీదేవికి ఐకానిక్ నివాళి!





యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ తన తల్లి, దివంగత నటి శ్రీదేవిని మరోసారి గుర్తుచేసుకున్నారు. హాలోవీన్ సెలబ్రేషన్ ను పురస్కరించుకుని, శ్రీదేవి కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిన 'నగీనా' (1986) సినిమాలోని ఆమె ఐకానిక్ లుక్‌ను రీక్రియేట్ చేశారు. అచ్చం తన తల్లిని పోలినట్టుగా సిద్ధమై, ఆ ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకోగా, అవి ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.వివరాల్లోకి వెళితే, హాలొవీన్ కోసం జాన్వీ కపూర్ 'నాగిన' చిత్రంలోని శ్రీదేవి పాత్రను ఎంచుకున్నారు. గులాబీ రంగు కాస్ట్యూమ్, దానికి సరిపోయే ఆభరణాలు, ప్రత్యేకమైన మేకప్, హెయిర్‌స్టైల్‌తో అప్పటి శ్రీదేవిని గుర్తుకుతెచ్చారు. కేవలం గెటప్‌తోనే సరిపెట్టకుండా, 'నగీనా' సినిమా పోస్టర్‌ను, కొన్ని నాటకీయ దృశ్యాలను కూడా రీక్రియేట్ చేసి అభిమానులను ఆకట్టుకున్నారు.ఈ ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ జాన్వీ ఓ భావోద్వేగ క్యాప్షన్ జోడించారు. "అందరికీ హ్యాపీ హాలోవీన్. సినీ చరిత్రలోని అత్యంత ఐకానిక్ క్షణాలలో ఒకదాన్ని రీక్రియేట్ చేయాల్సి వచ్చింది. హాలోవీన్ అంటే మనకు ఇష్టమైన పాత్రలు, పాప్ కల్చర్ మూమెంట్స్‌గా మారడం. కొన్నిసార్లు అవి భయపెట్టొచ్చు, కొన్నిసార్లు ఫన్నీగా ఉండొచ్చు, మరికొన్నిసార్లు అది ఒక నివాళి. అమ్మ (శ్రీదేవి), రిషి అంకుల్, అమ్రిష్ సర్‌ల కంటే ఐకానిక్ ఎవరుంటారు!!" అని ఆమె పేర్కొన్నారు.జాన్వీ పోస్ట్‌పై బాలీవుడ్ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. నటి కరీనా కపూర్ "టూ టూ గుడ్" అని కామెంట్ చేయగా, ఆమె సోదరి కరిష్మా కపూర్ హార్ట్ ఎమోజీలతో తన ప్రేమను వ్యక్తం చేశారు. భారతీయ సినిమా తొలి మహిళా సూపర్‌స్టార్‌గా కీర్తి పొందిన శ్రీదేవి, 'సద్మా', 'మిస్టర్ ఇండియా', 'చాందిని', 'లమ్హే' వంటి ఎన్నో మరపురాని చిత్రాలతో ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆమె నటించిన 'నగీనా' చిత్రం అప్పట్లో ఓ సంచలనం సృష్టించింది. ఇప్పుడు అదే పాత్రలో జాన్వీ కనిపించడంతో అభిమానులు శ్రీదేవిని గుర్తుచేసుకుంటున్నారు.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**